క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గుడివాడరూరల్: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు అన్నారు. మండలంలోని పర్నాస జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు మత్తు పదార్థాలు వినియోగిస్తే జరిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమ శిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మండలంలో ఎక్కడైనా నిషేధిత గంజాయి, డ్రగ్స్, కొకైన్ తదితర మత్తు పదార్థాలు విక్రయిస్తే ఆయా ప్రాంతాల్లో ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

రైతులు విశిష్ట గుర్తింపు నంబరు పొందాలి



తోట్లవల్లూరు: భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు నంబరు పొందాలని మండల వ్యవసాయాధికారి జి. నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఆయన రైతులకు అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 25వ తేదీ లోపల రైతులు తమ వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేయించుకోవాలని తెలిపారు.

రైతుల అభ్యున్నతికి కృషి



తోట్లవల్లూరు: చెరకు రైతుల అభ్యున్నతికి రోటరీ క్లబ్ కృషి చేస్తోందని ఆ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు అధ్యక్షుడు బొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని చాగంటిపాడు గ్రామానికి చెందిన రైతు జొన్నల జగన్మోహన్ రెడ్డి ఎద్దు ఇటీవల వ్యవసాయ పనులు చేస్తుండగా మృతి చెందింది. బాధిత రైతుకు రోటరీ తరపున రూ. 10 వేలను సాయంగా నాగ సుబ్రహ్మణ్యం శనివారం అందజేశారు. కేసీపీ జీఎం వీవీ పున్నారావు, డీజీఎం వెంకటేశ్వర్లు, ఏజీఎం మర్రెడ్డి ప్రసాద్‌రెడ్డి, అమర్‌నాథ్, రోటరీ కార్యదర్శి అమీర్‌మీర్జా పాల్గొన్నారు.

విద్యార్థినులకు భోజన ప్లేట్ల పంపిణీ



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు శనివారం 280 భోజన ప్లేట్లను లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జగన్మోహనరావు, లయన్స్ ప్రతినిధులు రామకృష్ణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు



గుడివాడ టౌన్: ఈనెల 26వ తేదీన జరగనున్న మహాశివరాత్రికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ గోపాలరావు తెలిపారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం(పెద్ద శివాలయం), గౌరీశంకరపురంలోని శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానం(చిన్న శివాలయం)లో ఈ పర్వదిన వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు.

ఆక్రమణ తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

కలిదిండి: ఆర్‌అండ్‌బీ రహదారిపై ఆక్రమణ దుకాణం తొలగించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కలిదిండి ఇందిరా కాలనీకి చెందిన కాసా ప్రభాకర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కలిదిండి ప్రధాన సెంటర్ మెయిన్‌రోడ్‌పై గుడివాడ ఫణికుమార్ అనే వ్యక్తి వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద పండ్ల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడన్నారు. దీని వల్ల ఆర్టీసీ బస్సులు, ఆటోల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా పంచాయతీ విద్యుత్ స్తంభాలకు ఆనుకుని దుకాణం ఉండటంతో మరమ్మతులు వచ్చినప్పుడు స్తంభాలు ఎక్కే పరిస్థితి లేదన్నారు. ఈ విషయాన్ని స్థానిక అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. దీంతో జిల్లా స్థాయిలో కలెక్టర్, పంచాయతీ అధికారి, ఆర్‌అండ్‌బీ అధికారి, ఆర్టీఓకు ఫిర్యాదును పంపించానని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ఆ దుకాణాన్ని తొలగించాలని కోరారు.

ఉపాధి కూలీలకు వసతులు కరువు



ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- రోజురోజుకు పెరుగుతున్న ఎండలు
- కనిపించని టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు

గుడివాడరూరల్: వేసవి మొదలు కాకముందే ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవిలో పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు అవసరమైన వసతులు కల్పించాలి. అయితే అధికారులు, సిబ్బంది వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలోని గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ మండలాల్లో 34,677మంది వేతనదారులు ఉన్నారు.

వడ దెబ్బ నుంచి రక్షణ ఏదీ?

గతంలో ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా ఉపాధి కూలీలకు అందజేసిన టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అడ్రస్ లేకుండా పోయాయి. వేసవిలో పని ప్రదేశంలో ఉపాధి కూలీలు సేదతీరేందుకు టెంట్లతో పాటు ప్రథమ చికిత్స కిట్లు అందజేసేవారు. వడ దెబ్బ నుంచి రక్షణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, తాగు నీటిని సైతం సమకూర్చేవారు. అలాగే వేసవిలో ఉపాధి కూలీలకు అదనంగా 10 నుంచి 20 శాతం వరకు అలవెన్సులు ఇచ్చేవారు. వీటితో పాటు గడ్డపారలు, చెరగపారలు వంటివి అందజేసి కూలీలను ప్రోత్సహించేవారు. ప్రస్తుతం కూలీలకు ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో కొన్నిచోట్ల ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు వెనుకాడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఉపాధి పనుల వద్ద టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, మజ్జిగ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



ప్రస్తుతం ఎండలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఉపాధి పనులు జరిగే చోట కూలీలకు అన్ని రకాల వసతులు కల్పించాలి. పనులు జరిగిన 15రోజుల్లో వేతనాలు చెల్లించాల్సి ఉండగా దీన్ని సక్రమంగా అమలు చేయడం లేదు. అలా ఇవ్వని క్రమంలో కూలీలకు వడ్డీతో కలిపి చెల్లించాలనే నిబంధన ఉంది. ఇక్కడ అధికారులు అమలు చేయడం లేదు. గతంలో ఇచ్చిన జాబ్‌కార్డుల వారికే పనులు కల్పిస్తున్నారు. కొత్తగా పనులకు వెళ్లేందుకు కార్డులు జారీ చేయడం లేదు. వీలైనంత త్వరగా మిగిలిన వారికి కూడా కార్డులు జారీ చేయాలి.

– ఆర్సీపీ రెడ్డి, సీపీఎం నాయకుడు

చర్యలు తీసుకుంటాం

ఉపాధి పనులు జరిగే గ్రామాల్లో కూలీలకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. వేసవిలో కూలీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. త్వరలోనే అన్ని చర్యలు చేపడతాం.

–బీవై విష్ణుప్రసాద్, ఎంపీడీఓ, గుడివాడ

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

జమీగొల్వేపల్లి(పామర్రు): మన బడి–మన భవిష్యత్ ద్వారా జరిగిన పనుల్లో పెండింగ్ ఉన్న వాటిని సత్వరమే పూర్తి చేయాలని సర్వశిక్ష ఏపీసీ ఎం.ఫణి ధూర్జటి పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి జెడ్పీ హైస్కూల్‌ను ఆయన శనివారం పరిశీలించారు. అసంపూర్తిగా మిగిలి ఉన్న వంట షెడ్డు, టాయిలెట్స్‌ను, మన బడి–మన భవిష్యత్‌లో మిగిలి ఉన్న ఫండ్స్ వివరాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మిగిలిన ఫండ్స్‌ను ఉపయోగించుకుని వచ్చినంత వరకు పనులను చేయించాలని ఆదేశించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న స్టడీ క్లాసులను పరిశీలించారు. హైస్కూల్ హెచ్ఎం టి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



జమీగొల్వేపల్లి హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఫణి ధూర్జటి

క్రీడలపై దృష్టి సారించండి

కైకలూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గస్థాయి సబ్ జోన్ బాలుర క్రీడలు ఆరుతెగళపాడు ఉన్నత పాఠశాల్లో శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులను అభినందించారు. నాలుగు మండలాల నుంచి 6 నుంచి 9వ తరగతి చదివే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 500 మంది క్రీడల్లో పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, కో–కో, షార్ట్‌పుట్, లాంగ్ జంప్, 100, 200, 400, 600 మీటర్ల పరుగు పందేలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.శ్రీనివాసరావు, ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, హెచ్ఎం శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు రవిచంద్ర, లూయిస్, నాగేశ్వరరావు, సుబ్బారావు, వేణుబాబు, రవిబాబు, మవులేశ్వరరావు, శిరిషా, రోజా పాల్గొన్నారు.

విజేతలు వీరే..

కబడ్డీలో ప్రథమ బహుమతి కలిదిండి (జెడ్పీహెచ్ఎస్), ద్వితీయ బహుమతి ముదినేపల్లి(జెడ్పీహెచ్ఎస్), వాలీబాల్‌లో ప్రథమం కైకలూరు (ప్రభుత్వ హైస్కూల్), ద్వితీయం ఓరియంటల్ స్కూల్ (కైకలూరు), త్రో బాల్‌లో ప్రథమం భాస్కరరావుపేట (జెడ్పీహెచ్ఎస్), ద్వితీయ కలిదిండి (జెడ్పీహెచ్ఎస్), కో–కోలో ప్రథమం భాస్కరరావుపేట (జెడ్పీహెచ్ఎస్), ద్వితీయం కైకలూరు (ప్రభుత్వ హైస్కూల్) సాధించాయి. అదేవిధంగా షార్ట్‌పుట్‌లో కలిదిండి, కైకలూరు, గుర్వాయిపాలెం, లాంగ్ జంప్‌లో ముదినేపల్లి, కలిదిండి, కేపీఎస్ కలిదిండి ప్రైవేట్ స్కూల్, 100 మీటర్ల పరుగులో కైకలూరు, మేదినేపల్లి, కేపీఎస్ కలిదిండి ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. 200 మీటర్ల పరుగులో కైకలూరు, భాస్కరరావుపేట, కేపీఎస్ కలిదిండి ప్రైవేటు స్కూల్, 400 మీటర్ల పరుగులో కైకలూరు, కలిదిండి, భాస్కరరావుపేట, 600 మీటర్ల పరుగులో కైకలూరు, భాస్కరరావుపేట, ముదినేపల్లి పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు.



ఆరుతెగళపాడు స్కూల్లో క్రీడాకారులతో ఎమ్మెల్యే కామినేని

నిబంధనలు తప్పనిసరి

గుడివాడ టౌన్: వ్యాపార సముదాయాల్లో అగ్నిమాపక నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి డి. ఏసురత్నం అన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని ఓ బహుళ అంతస్తుల వ్యాపార సముదాయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. నాలుగు అంతస్తుల భవనానికి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ లేదన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక అధికారి జి. ఆంజనేయులు పాల్గొన్నారు.



భవనాన్ని తనిఖీ చేస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

అంగన్‌వాడీల ఆందోళన బాట

గుడ్లవల్లేరు: అంగన్‌వాడీల వర్కర్లు అన్ని ప్రాంతాల్లో ఆందోళన బాట పట్టారు. స్త్రీ శిశు సంక్షేమ పరిధిలోని గుడివాడ కార్యాలయ పరిధిలోని నాలుగు మండలాల్లో 251 అంగన్‌వాడీ కేంద్రాల్లోని వర్కర్లు తమ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ గత సోమవారం అన్ని చోట్లా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.26 వేల నెల జీతం ఇవ్వాలని కోరుతున్నారు. ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలతో ప్రభుత్వం ఇచ్చే చాలీ చాలని జీతాలు సరిపోవడంలేదని పేర్కొన్నారు. మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మార్పు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లపై జీఓను విడుదల చేయకపోతే ప్రభుత్వంపై ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ అంగన్‌వాడీ వర్కర్లకు ఎలాంటి జీత భత్యాలు పెంచలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకపోతే పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేయక తప్పదని అంగన్‌వాడీ వర్కర్లు చెబుతున్నారు.



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు (ఫైల్)

జీతాలు పెంచకపోతే ఉద్యమం ఉద్ధృతం



అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలను నెలకు రూ.26వేలకు పెంచకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తాం. అంగన్‌వాడీ వర్కర్లు అడిగే న్యాయమైన జీతాన్ని పెంచని ప్రభుత్వాలు ఎందుకు? అసలే ఒక పక్కన నిత్యావసర వస్తువులు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే చాలీచాలని జీతాలతో అంగన్‌వాడీ వర్కర్ల కుటుంబాలు ఎలా బతికేది?

– పిడుగు దేవసహాయం, సీపీఎం గుడ్లవల్లేరు మండల నాయకుడు

జీఓను విడుదల చేయాలి



ప్రభుత్వం జీఓ విడుదల చేసేంత వరకు ఉద్యమాన్ని వదిలేది లేదు. మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మార్పు చేయాలన్న డిమాండ్ అంగన్‌వాడీ వర్కర్లు చేస్తున్నారు. మోదీ ప్రధానిగా వచ్చాక ఇంతవరకు పెంచని జీతాన్ని పెంచాలి. ఈ డిమాండ్లపై జీఓను విడుదల చేయకపోతే ప్రభుత్వంపై ఉద్యమం తప్పదు.

– బి.వి.శ్రీనివాసరావు, సీపీఎం గుడ్లవల్లేరు మండల నాయకుడు

టిడ్కో కాలనీలో రోడ్లకు మరమ్మతులు



గుడివాడ టౌన్: స్థానిక టిడ్కో కాలనీలో రహదారులపై ఏర్పడిన గోతులను ఆర్‌కే యూత్ సభ్యులు శనివారం పూడ్చారు. గోతుల కారణంగా రాత్రి వేళల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని గమనించిన ఆర్‌కే యూత్ సభ్యులు స్పందించి, స్వచ్ఛందంగా గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టినట్లు యూత్ కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. సమాజసేవ ధ్యేయంగా తమ యూత్ సభ్యులు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పి. చిన్న, డి. పద్మ, ఎస్. మోబిన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగానమ్మ ఆలయ జీర్ణోద్ధరణ

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ గంగానమ్మ తల్లి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. గ్రామస్తుల సంయుక్త సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. అమ్మవారిని భక్తులందరూ దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ శనివారం ప్రారంభించారు. కేర్ టు యాక్షన్ సంస్థ వారు సుధా ఫెర్టిలిటీ హాస్పిటల్ వైద్య బృందం వారిచే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 170 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు.

పామర్రు జెడ్పీ హైస్కూల్ ఎందరికో మార్గదర్శకం

ఘనంగా హైస్కూల్ వార్షికోత్సవం

పామర్రు: ఎంతో మందిని అక్కున చేర్చుకుని వారు ఉన్నతులుగా ఎదగేందుకు విద్యాబోధన అందించిన పామర్రు జెడ్పీ హైస్కూల్ భవిష్యత్‌లో మరింత మందికి మార్గదర్శకంగా నిలవాలని రాష్ట్ర ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ జాయింట్ డెరెక్టర్ బత్తుల మనోరంజని పేర్కొన్నారు. స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ ఉన్నత పాఠశాల 99వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్య్రం ఏర్పడక ముందే బ్రిటిష్ వారి పాలనలో 1926లో వీధి బడిగా ఏర్పడిందన్నారు. స్థానిక పెద్దల సహకారంతో కాలక్రమేణ జిల్లా పరిషత్ యాజమాన్యంతో స్థానిక సబ్ కోర్టు ప్రాంగణంలోని భవనంలో పూర్తి స్థాయి హైస్కూల్‌గా 1936లో ఎదిగినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ హైస్కూల్లో 561 మంది విద్యార్థులున్నారని పేర్కొన్నారు. ఈ 99 ఏళ్లలో లక్ష మందికి పైగా విద్యార్థులు చదువుకున్నారన్నారు. వీరిలో చాలా మంది అమెరికా తదితర దేశాల్లో ఇంజినీర్లు, డాక్టర్లు, కాంట్రాక్టర్లు, ఉపాధ్యాయులు, రాజకీయవేత్తలుగా స్థిరపడి ఉన్నారని తెలిపారు. ఈ హైస్కూల్లో తాను 1977వ సంవత్సరంలో పదో తరగతి చదివి ఉత్తీర్ణురాలై తర్వాత ఉన్నత చదువులు చదివి రాష్ట్ర ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ జాయింట్ డైరెక్టర్ స్థాయికి ఎదిగినట్లు పేర్కొన్నారు. డీఈఓ పీవీజే రామారావు మాట్లాడుతూ 99 ఏళ్ల చరిత్ర కల్గిన ఈ పాఠశాల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించి విద్యార్థుల అభివృద్ధికి మరింతగా కృషి చేయాలన్నారు. కృష్ణా జిల్లాలో గత ఏడాది పదో తరగతిలో 90.5 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. ఈ ఏడాది దీనిని అధిగమించి నూటికి నూరుశాతం ఫలితాలు సాధించేలా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి, అమలు చేస్తున్నామన్నారు. అనంతరం పలు క్రీడా పోటీల్లో విజేతలకు షీల్డులను, బహుమతులను అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి పీఎంఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రానున్న శత వసంతాల వేడుకలను ఎంతో స్ఫూర్తిదాయకంగా నిర్వహించాలని సంకల్పిస్తున్నామన్నారు. తొలుత పాఠశాల హెచ్ఎం ఆలపాటి ఇందిరారాణి పాఠశాల సమగ్ర సమాచారాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో ఉయ్యూరు డీవైఈఓ పద్మారాణి, పామర్రు ఎంఈఓ–2 పద్మావాణి, తహసీల్దార్ రవికాంత్, సీఐ సుభాకర్ , ఉపాధ్యాయులు బ్రహ్మేశ్వరరావు, దాతలు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్ర ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ మనోరంజని



విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న డీఈఓ రామారావు

గులాబి తోటలోకి అడుగిడిన అనుభూతి

గుడ్లవల్లేరు: అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల్లోకి వచ్చినప్పుడు ఒక మంచి గులాబీ తోటలోకి అడుగు పెట్టిన అనుభూతి కలిగిందని డీఈఓ పి.వి.జె.రామారావు పేర్కొన్నారు. హైస్కూల్లో శనివారం నిర్వహించిన 79వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గుడ్లవల్లేరు, పామర్రు మండలాల ఎంఈఓ–1గా కృషి చేస్తూ అంగలూరు హైస్కూల్లోని టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణతకు కష్టపడుతున్న జగన్మోహనరావును ఆయన ప్రశంసించారు. ఈ హైస్కూల్లో ఏడుగురు విద్యార్థినులు ఎన్ఎంఎంఎస్ సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ఆయన మెచ్చుకున్నారు. గతేడాది టెన్త్‌లో విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది కూడా వంద శాతంతో పాటు అత్యధిక మార్కులను ఎక్కువ మంది సాధించాలని ఆకాంక్షించారు. డైట్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ, ఉయ్యూరు డీవైఈఓ ఐ.పద్మారాణి, ఎంఈఓ–2 జి.గోపాల్, సర్పంచ్ మేడేపల్లి రవికుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శేషుబాబు, ఉప సర్పంచ్ సురేష్, సీనియర్ లెక్చరర్ వినయ్‌కుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ కల్యాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రామారావు

ప్రతి ఒక్కరికీ ఉచితంగా తాగునీటి కుళాయి

మండవల్లి: కుళాయిలేని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేవిధంగా జల్‌జీవన్ మిషన్ పథకానికి మండవల్లి ఎంపికైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక సచివాలయం వద్ద జల్‌జీవన్ మిషన్ ఉచిత కుళాయిల పంపిణీ కార్యక్రమంపై శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ జల్‌జీవన్ పథకం కింద మొగలాయి చెరువుకు రూ.69 లక్షలు, కొండరాయి చెరువుకు రూ.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారులను గుర్తించి త్వరితగతిన పనులు ప్రారంభించి కుళాయిలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఎంపీపీ శ్రీరామదుర్గాప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు, గుడివాడ చిట్టిబాబు, కోట ప్రసాద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్

పరుగు పందెంలో విద్యార్థినుల ప్రతిభ

మండవల్లి: ముదినేపల్లిలో ఈ నెల 21న జరిగిన ఎస్‌జీఎఫ్‌లో భాగంగా కైకలూరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో కానుకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. 100 మీటర్ల పరుగు పందెంలో 9వ తరగతి విద్యార్థిని రుక్మిణీదేవి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. 600 మీటర్ల పరుగు పందెంలో 9వ తరగతి విద్యార్థిని ఎస్ కావ్య ద్వితీయ స్థానం నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను, పీడీ సత్యనారాయణను హెచ్ఎం మాధవకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె శ్యాంప్రసాద్, సీహెచ్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.



బంగారు పతకం సాధించిన రుక్మిణీదేవి

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో అంగన్‌వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి 4వ రోజు శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల సామాజిక భాగస్వామ్యం, బోధనా అభ్యాసన సామగ్రి తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ పీఎస్‌జీవీవీ ప్రసాద్, శిక్షకులు రూప్‌కుమార్, సూఫియాన్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ముమ్మరంగా మినుముతీత పనులు

పమిడిముక్కల: మండలంలో మినుముతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి తరువాత మినుము సాగుచేశారు. 16 వేల ఎకరాల్లో మినుము సాగు చేయగా ఇప్పటివరకు ఆరు వేల ఎకరాల్లో మినుముతీత తీసి కుప్పలు వేశారు. ఎకరాకు మినుముతీతకు రూ.9,000 ఖర్చవుతుందని రైతులు తెలిపారు.

యాచకులకు భోజనం



భోజనం పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మండపాడులోని నైట్ షెల్టర్ వృద్ధాశ్రమం యాచకులకు భోజనం, పండ్లు, స్వాట్స్ పంపిణీ చేశారు. ఈడే చంద్రశేఖర్ వితరణతో ఈ ఏర్పాట్లు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు కోనా రామారావు తెలిపారు.

గురుకుల పాఠశాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉరుటూరు(పామర్రు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల (బాలుర) పాఠశాల్లో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌బాబు పేర్కొన్నారు. పామర్రు మండలం ఉరుటూరు శివారు నల్లగుంటలోని పాఠశాల్లో శనివారం ఆయన మాట్లాడుతూ 2025–26కు సంబంధించిన 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులను కోరుతున్నామని తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలురు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏపీబీఆర్ఏజీ సీఈటీ–2025కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా పాఠశాల్లో 2023–24లో 3వ తరగతి, 2024–25లో నాలుగో తరగతి పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. తండ్రి/తల్లి వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉండాలని, విద్యార్థి ఆధార్ కార్డు, విద్యార్థి పాస్పోర్టు సైజ్ ఫొటో, తండ్రి/తల్లి ఫోన్ నంబరు కావాలని తెలిపారు. మార్చి 6వ తేదీ లోపుగా దరఖాస్తులను స్కూల్ సమయంలో వచ్చిన వారికి అప్లికేషన్ ఆన్‌లైన్‌లో ఉచితంగా నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 70327 03753లో సంప్రదించాలని కోరారు.